# హంసలను వేటాడొద్దు [11]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [11]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జూన్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2825

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [11]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** లిండెన్ చెట్టుబెరడు అమ్మి లాభాలు సంపాదించాలన్న యెగార్ ఆఖరు ఆశ కూడా కుప్పకూలటంతో ఇక అతను విధికి లొంగి దిగులులో మునిగిపోతాడు. క్రోక్, ఫిల్ అనే ఇద్దరితో కలిసి తాగటం మొదలుపెడతాడు. తాగుడు కోసం ఇంట్లోంచి డబ్బులు దొంగిలించటం కూడా మొదలుపెడతాడు. హారిటీనా ఆ డబ్బులు దొంగిలిస్తోంది తన కొడుకు కోల్కా అనుకుని అతణ్ణి కొడుతుంది. యెగార్ తప్పు ఒప్పుకుంటాడు. కోల్కాకి తనతో చదువుకునే ఓల్యా అంటే ఇష్టం. కానీ ఆమె ఫ్యోడార్ ఇపటొవిచ్ కొడుకు ఓవాతో చనువుగా ఉంటుంది. ఒకసారి ముగ్గురూ కలిసి ఈతకు వెళ్తారు. దారిలో గాయమైన ఒక గజ్జికుక్కపిల్ల దొరికితే ఓవా దాన్ని నీటిలో ముంచి చంపుతానంటాడు. చంపవద్దని, కావాలంటే బదులుగా తన దిక్సూచి అతనికి ఇస్తాననీ అంటాడు కోల్కా. **ఇక చదవండి**:——

## 11

ఇల్లు లేని వ్యక్తికి ఏమీ లేవు. అటువంటివాళ్లంటే ఫ్యోడార్ ఇపటొవిచ్‌కి గౌరవం లేదు, యకోవ్ ప్రొకొపిచ్‌కి భయం. ఇల్లు లేనివాళ్లకు ఏముంది? – అదీ ప్రశ్న. ఊహలు తప్ప ఏమీ ఉండవు.

అయితే, నోనా యురీవ్నాకి ఆ ఊహలు కూడా లేవు. పుస్తకాలు, గ్రామఫోను రికార్డులు, ఒక యువతి కోరికలు తప్పించి ఆమె దగ్గర ఏమీ లేవు. ఈ కారణంగా ఆమెకు ప్రతిఒక్కరి పట్ల ఎంతో కొంత అసూయగా ఉండేది – చివరికి హారిటీనా పొలుష్కిన్ అంటే కూడా: ఆమెకు బల్ల దగ్గర క్యాబేజి పులుసు తాగే కోల్కా ఉన్నాడు, పాలు తాగే ఓల్యా ఒడిలో ఉంది. ఇటువంటివి ఉన్నప్పుడు అసమర్ధుడైన భర్తని కూడా భరించవచ్చు. అసలుకి భర్త అనేవాడు ఒకడుంటే.

మొదట కురిసిన మంచు మాదిరి స్పష్టంగా ఉన్న తనలోని ఈ అసూయ గురించి నోనా ఎవరికీ చెప్పలేదు. వాస్తవానికి ఆమెకు కూడా ఆ విషయం తెలియదు – ఆ అసూయ ఆమె లోపల ఆమెతో సంబంధం లేకుండా కొనసాగుతోంది. అది స్వతంత్రంగా జీవిస్తూ, వృద్ధి చెందుతూ రాత్రిళ్లు ఆమెను బాధిస్తోంది, వళ్లంతా ఆవిర్లు కమ్ముకునేలా చేస్తోంది. ఇదంతా ఎవరైనా నోనాతో

అని ఉంటే ఆమె స్పృహ తప్పి పడిపోతుంది, ఆమెకు ఉన్నట్టుండి గుండెపోటు వస్తుంది. చాలా పదునైన ముక్కు, పదుననైన కన్ను, పదునైన చెవి ఉన్న ఆమె యజమానురాలికి ఇదంతా తెలుసు. అప్పటికే ఆమె ఈ విషయాన్ని ఎవరు కనపడితే వాళ్లకి గుసగుసగా చెబుతూనే ఉంది.

"ఆమె దిండును కొరికేస్తోంది – దేవుడి మీద ఒట్టు, తలుపు సందుగుండా నేను చూశాను. ఆమె రక్తం ఉడికిపోతోంది."

దీనితో ఏకీభవిస్తున్నట్టు ఆమె స్నేహితులు తలలూపేవారు.

"ఆమె పాసిపోవటం ఖాయం: దానికెంతో సమయం లేదు. మొదటి సంతానం కలిగేనాటికి మన వయస్సెంత? చ్చొ, చ్చొ, మూడవ సంతానం ఉయ్యాలలో ఉండాల్సిన వయస్సు ఆమెది."

ఈ మాటలు, గుసగుసలతో అలసిపోయిన నోనా యురీవ్నాకి పెద్దగా అరవాలనిపించేది. అంతకుముందు వరకు ఆమె ఎప్పుడూ తన కోసం పోరాడలేదు, అందుకు ప్రయత్నించలేదు కూడా. కానీ ఇప్పుడు కాలికి బలపం కట్టుకుని అధికారుల చుట్టూతా తిరిగింది. ఆమెకు అంత ఓపిక, పట్టుదల ఎక్కడినుంచి వచ్చాయో ఆ దేవుడికే తెలియాలి. తనకు కావలసింది దక్కటానికి అవసరమైనవన్నీ పట్టు విడవకుండా చేసింది.

"నీకొక వేరే గది ఇస్తాం. అయితే, దురదృష్టవశాత్తు, దాని పరిస్థితి అంత బాగాలేదు."

"అది ఏ పరిస్థితిలో ఉన్నా పరవాలేదు!"

మొద్దుబారిన హృదయం పైకప్పులు కోరుకోదు: దానికి గోడలుంటే చాలు. తీక్షణ చూపులనుంచి దానికి రక్షణ కావాలి. పైనుంచి నీళ్లు కారితే కారనీ. గోడలున్నంతవరకు, ఏడ్వటానికి చోటున్నంతవరకు చాలు.

నోనా యురీవ్నా తనివి తీరా ఏడ్చింది, దాంతో ఆమె ఊరట పొందింది: ఇప్పుడామె నవ్వుతోంది కూడా. కన్నీళ్లు ఆగటంతోనే పైనుంచి వరద రాసాగింది: వాన కురిసి, ఎటువంటి ఆటంకం లేకుండా గదంతా కారసాగింది. ఆమె దగ్గర ఉన్న గిన్నెలు, బక్కెట్లు అన్నీ నిండిపోయాయి. నోనా ప్రశాంత తత్వాన్ని ఈ వాన మళ్లీ కార్యాచరణకు పురికొల్పింది.

అయితే ఈసారి ఆమె ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది: "మరమ్మతులకు ఉద్దేశించిన నిధులన్నీ అయిపోయాయి."

"కానీ పైకప్పు కారుతోంది, వాన పడుతున్నట్టుగా కారుతోంది."

వాళ్లు పెద్దమనిషి తరహాగా నవ్వారు.

“కారుతున్నది పైకప్పు కాదు, గూడు. పైకప్పు కారేలాగా చెయ్యరు. గూడు అంటారా, అది కారవచ్చు. అవును. వచ్చే సంవత్సరం మరమ్మతుల జాబితాలో నీ పేరు చేరుస్తాం.”

“దయచేసి నా మొర ఆలకించండి. అక్కడ ఉండటం అసాధ్యం. పైకప్పునుంచి వాన వరదలాగా వస్తోంది –”

“గది బాగాలేదని మేం ముందుగానే హెచ్చరించాం; ఆ విషయం నిరూపించటానికి ఇదిగో మా దగ్గర కాగితం ఉంది. కాబట్టి ఇది నీ తప్పే.”

దాంతో ఆ అమ్మాయి మళ్లీ నవ్వటం మానేసింది: తను ఎంతగానో కలలు కని, కష్టపడి సంపాదించిన గది భోరున విలపిస్తుంటే తాను ఎలా నవ్వగలదు? గది అంతా పుట్టకొక్కులు మొలుస్తుంటే ఏం చెయ్యాలి! వాటిని నిల్వచేసి, డబ్బాల్లో పెట్టి అందమైన లెనిన్‌గ్రాడ్‌లోని అమ్మకు పంపించాలి!

అయితే ఆమె అదృష్టం బాగుంది. తాను అదృష్టవంతురాలినని నోనా లోలోన నమ్మేది, కాబట్టి తన అదృష్టానికి ఆమె అశ్చర్యపోలేదు. అనుకోకుండా ఆమెకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న ఒక మంచి మనిషి తారసపడ్డాడు. బట్టతలవాడు, రోమను లాగా సహృదయుడు.

“మీ గది కారుతోంది, అంతే కదా. దానిని మేం బాగు చేస్తాం.”

అతడి మాటల్లో బూతులు ధారాళంగా ప్రవహించసాగాయి. ఆ మాటలకు సమాధిలోని సన్యాసి అయినా కలవరపడతాడు. ఆ రకమైన సంభషణను నోనా ఎలాగో సహించింది. బుగ్గలు ఎర్రబడకుండా ఉండటం కూడా అలవాటు చేసుకుంది.

“నాకొక బృందం ఉంది – ఒక్కొక్కళ్లు ఇద్దరు పెట్టున పని చేస్తారు, ముగ్గురు పెట్టున తింటారు, మద్యం ఎంతున్నా లాగించేస్తారు. కాబట్టి ఈ ఒప్పందం ఖరారు చేసుకోటానికి ఒక సీసా సిద్ధంగా ఉంచండి.”

ఆ రోమను నుంచి సర్పిలాకారంలో ఆవిర్లు పైకి వస్తున్నాయి – ఆ ధాటికి దోమలు చచ్చి అతడి చుట్టుపక్కల పడుతున్నాయి. అది సహజం: మానవాభివృద్ధి వర్తుల దారిలోనేసాగింది. అయితే అతడి చుట్టూ ఉన్న వర్తులం చాలా ఘాటుగా ఉండటంతో ఎందుకైనా మంచిదని నోనా అడిగింది, “ఏం సీసా తెమ్మన్నారు?”

“నాటు రకంది, తాగితే నసాళానికి ఎక్కేది!”

నోనా సీసా కోసం వెళ్లగా రోమనుగారు మిగిలినవాళ్లు పనిచేసే చోటుకి పరుగున చేరుకున్నాడు.

“మనకి డబ్బు వర్షం కురవబోతోంది, అలా కాకపోతే నన్ను చెప్పుచ్చుకుని కొట్టు. దేవుడు మనకి ఒక అమాయకురాలిని పరిచయం చేశాడు: ఆమె గది కారుతోంది. చితుకు బొతుకు అడ్డంపెట్టి అది కారకుండా చేద్దాం. దానికి ఆ అమాయకురాలినుంచి బాగానే డబ్బు రాబట్టవచ్చు!”

ఆత్మ జ్ఞానానికి సంబంధించి ఆ రోజు వృధా అయ్యిందనే చెప్పాలి. అందరూ ఎందుకో గుర్రుగా కూడా ఉన్నారు. ఆ ఖాళీ ప్రదేశంలో ఏదో పని దొరకగా క్రోక్ పని పూర్తయ్యిందనిపించే రంధిలో ఉన్నాడు. మట్టి వేస్తూ ఒకరినొకరు తిట్టుకుంటున్నారు.

“గోడని తట్టు. కొట్టమని చెప్పాను!”

“దానిని కొట్టాల్సిన పనేమిటి? అదేమీ అమ్మాయి కాదే!”

“అది పడిపోతోంది, అందుకని!”

“పడిపోతే, పడిపోని. ఇక్కడ ఆదేశాలు ఇచ్చే బదులు ఇంటికెళ్లి కట్టుకున్న పెళ్లాన్ని కొట్టి ఒకటో, రెండో రూబుళ్లు తీసుకురావచ్చు కదా. దానికి కూడా ప్రకృతి తల్లి మనల్ని చూసి చిరునవ్వు నవ్వుతుంది.”

యెగార్ ఏమీ మాట్లాడలేదు. కందకంలో గోడని నిర్వికారంగా తడుతూ జారిన మట్టిని బయటకు తీస్తున్నాడు. తనకు తెలిసినట్టుగా గోడను తడుతూ, మట్టిని తీస్తున్నా ఒకప్పుడు మాదిరి అతడు తన పనిలోని ఆస్వాదనని పొందలేకపోతున్నాడు. చుట్ట తాగే విరామాలు, కబుర్లు మరిచి పనిచేసిన రోజులు గతమైపోయాయి. ఆ అనుభూతులు పోవటంతో ఇప్పుడు ఆ రోజుకి పూర్తి చెయ్యాల్సిన పనిని ఎటువంటి తిట్లు, అవమానాలు లేకుండా పూర్తి చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఎవరికో డబ్బులు ఇచ్చానని, అతడు కనపడకుండాపోయాడని చెప్పిన ఘటన తరువాత, హారిటీనా కన్నీళ్లు, కోల్కా చూపుల తరువాత అతడు ఇంట్లోంచి ఒక్క కొపెక్కు కూడా తియ్యనని ఒట్టేసుకున్నాడు కాబట్టి అప్పటికి అతడు మాట్లాడకుండా ఉండిపోయాడు. అతడు నిజంగా దేవుడిని నమ్మకపోయినా ఎవరూ చూడకుండా శిలువ గుర్తు వేసుకుని మరీ మాటిచ్చాడు. ఇప్పటివరకు

అతడు ఆ మాట మీద నిలబడ్డాడు. అదే అతని చివరి జీవనరక్ష అయినట్టు దానిని నిలుపుకుంటున్నాడు.

ఆ సమయంలో క్రోక్ పరిగెత్తుకుంటూ వచ్చి ఏమీ తెలియని అమాయకురాలి ఇంటిలో కారుతున్న ఇంటికప్పుకి సంబంధించిన శుభవార్త తీసుకొచ్చాడు.

“ఈ పని ఇప్పటికి ఆపి ఇక పదండి, మిత్రులారా!”

వాళ్లు వెంటనే బయలుదేరారు. తిరిగి ఉత్సాహం నిండటంతో పారలు కందకంలో పడేసి ముఖాలు కడుక్కోటానికి నదికి వెళ్లారు. ఆ తరువాత పైకప్పు కారుతున్న ఆవిడతో ఒప్పందం కుదుర్చుకోటానికి బయలుదేరారు. అక్కడి ఆహారం గురించి తలుచుకునే సరికి వాళ్ల పేగులు నకనకలాడసాగాయి.

దూరంనుంచే యెగార్ ఇంటిని చూసాడు: సగం కప్పు బాగానే ఉంది, సగం గడ్డి పెరిగి ఉంది – ఈ సగంతోనే వాళ్లకి ప్రస్తుతం పని. కప్పుకున్న కలప చట్రాన్ని చూసాడు: అది చివికిపోకుండా బాగానే ఉంది. ఆ చిన్న ఇంటిని బాగు చెయ్యటానికి ఎంతో పని పట్టదు. చట్రాన్ని సరిచేసి, కొన్ని కొయ్య పలకలను బాగుచేస్తే సరిపోతుంది.

పనిమంతుడైన వడ్రంగి చూపుతో అతడు వెంటనే పనిని అంచనా వేశాడు. అయితే తన ఆలోచనలను అతడు బయటపెట్టలేదు. ఎందుకంటే ఇది నిజాయితీ పని కాదు, మోసకారి పని. కాబట్టి ఇక్కడ అసలు పనెంతో బయటపెట్టకూడదు. ఏదైనా నిర్లక్ష్యం చేసిన పనిని గోరంతలు కొండంతలు చేయటం, అవతలి వాళ్లని భయపెట్టేసి సాధ్యమైనంత డబ్బు గుంజటం – ఇదీ వాళ్లు వ్యవహరించే తీరు. ఈ రకంగా సంపాదించిన దానిపై ప్రభుత్వం, జమా-ఖర్చుల శాఖ, ఆర్థిక తనిఖీదారు, భార్య వంటివాళ్ల నియంత్రణ ఏమీ ఉండదు.

వసారా కూడా బాగు చేసి, తలుపు చిడతలు మార్చాల్సిన అవసరం ఉందని అతడనుకున్నాడు. వసారాలో అడ్డ దూలం కొంచెం సరిచెయ్యాలి, ఇంకా... ఆ సమయంలో కిర్రుమంటూ తలుపు తెరుచుకుంది. క్రోక్ నవ్వుతూ పలకరించాడు, “ఇదిగో మా బృందం! అమ్మాయిగారూ, ఇప్పుడు మీ సమస్యలేమిటో ఏకరువు పెట్టండి, వాటి జిమ్మదియ్య...”

“రండి,” ఆ అమ్మాయి ఆహ్వానించింది. యెగార్ తప్ప మిగిలిన ఇద్దరూ లోపలికి వెళ్లారు. ఆమెను గుర్తుపట్టిన అతడికి నోటమాటరాలేదు: నోనా యురీవ్నా. ఆ రోజు కోల్కా వాళ్ల అమ్మ

దగ్గరికి కాకుండా ఈమె దగ్గరికి వెళ్లాడు. ఆమె ఇంటిలో గ్రామఫోను రికార్డులు విన్నాడు: ఆ రికార్డులోని గొంతు ఏనుగులాగా ఉందని కోల్కా చెప్పాడు...

యెగార్ వసారాలోనే తటపటాయిస్తూ ఉండిపోయాడు – అతడు లోపలికి వెళ్లలేకపోతున్నాడు, అక్కడినుంచి పరిగెత్తి పారిపోటానికి ధైర్యం కూడగట్టుకోలేకపోతున్నాడు. ఇటువంటివాళ్ల స్నేహితుడిగా, ఇటువంటి పనిమీద ఆమె ఇంటిలోకి ప్రవేశించటానికి అతడికి సిగ్గుగా ఉంది, వడ్రంగం గురించి కొంత తెలిసి ఉండటం అతడికి ఏదో తెలియని కొంత తృప్తిని ఇచ్చింది.

“యెగార్ సవెలిచ్, లోపలికి రాకుండా బయటే ఉండిపోయారేంటి?”

అంటే ఆమె అతడిని గుర్తించిందన్నమాట. యెగార్ నిట్టూర్చి, టోపీ తీసి, పాడుపడిన లోపలి గదిలోకి వెళ్లాడు.

వాళ్లిద్దరూ నాటు సరుకును లాగించేస్తున్నారు. మధ్య మధ్యలో టొమాటో పచ్చడి అద్దుకుంటూ వేపిన రొయ్య పప్పులు తింటున్నారు. ఫిల్ ఒక వేలు పైకెత్తి ఉన్నాడు.

“చీకాకు పెట్టే లేదా ఇబ్బంది కలిగించే చిన్న, చిన్న భౌతిక విషయాలు ఎన్ని ఉన్నాయి: వాటిని ఎవరు లెక్కపెట్టగలరు? శ్రమజీవులమైన మేం ఆ పని చెయ్యగలం. జీవితంలో చీకాకు పెట్టే, ఇబ్బంది కలిగించే ప్రతి పని మా చేతులలో పరిష్కారమవుతుంది. చేతులు చేసే పనిని మనస్సు ఎప్పటికీ మరిచిపోదు: అంతేకదండి, అమ్మాయిగారూ? హ, హ. కాబట్టి మిత్రులారా, పౌరులారా, సహచరుల్లారా, ఈ శ్రమించే చేతుల కోసం తాగుదాం. మనకి తాగటానికి, తినటానికి ఇచ్చినవాళ్ల కోసం కూడా తాగుదాం.”

క్రోక్ నిశ్శబ్దంగా తాగాడు. గ్లాసెత్తి ఒక్కసారిగా తాగేసి, పెద్దగా తేన్చి, చొక్కా చేతికి మూతిని తుడుచుకున్నాడు. అతడు సంతోషంగా ఉన్నాడు. చాలా సంతోషంగా ఉన్నాడు: చాలా అరుదైన అవకాశం దొరికింది. అమాయకుల్లో అమాయకురాలు ఈమె.

అయితే యెగార్ తాగలేదు.

“మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు,” అంటూ అతడు తన గ్లాసును పక్కన పెట్టేశాడు.

“తాగనని ఎందుకంటున్నావు, యెగార్ సవెలిచ్?”

“ఇంత త్వరగా నేను తాగను,” అతడు బదులిచ్చాడు.

రెండవసారి వేలు పైకెత్తటానికి సిద్ధంగా ఉన్న ఫిల్ వంక యెగార్ రెప్పార్చకుండా చూస్తూ ఉన్నాడు. ఫిల్ మొదలుపెట్టక ముందే యెగార్ ఇలా చెప్పసాగాడు, "శ్రమించే చేతులకోసం మనం తాగవచ్చు, పూర్తి గౌరవంతో తాగవచ్చు. కానీ ఆ శ్రమించే చేతులు ఎక్కడ ఉన్నాయి? అవి నా చేతులా? కాదు, నావి కావు. నీవా, లేక క్రోక్‌వా? కాదు, నీవి కావు, అతడివి కావు. మనం దొంగలం, పనిమంతులం కాదు. దొంగలం. సంతోషించటానికి బదులు మనం కన్నీళ్లు కార్చాలి, సిగ్గుతో, అవమానంతో."

నోనా యురీవ్నా కళ్లు ఆమె అద్దాలంత పెద్దగా అయ్యాయి. ఫిల్ ఆలోచిస్తూ భృకుటి ముడివేశాడు. క్రోక్ విషయానికి వస్తే అతడు తనదైన ప్రవర్తనలో ఉన్నాడు: అగాధంలాంటి అతడి పొట్టలోకి రెండవ గ్లాసు ఖాళీ చేసి చొక్కా చేతితో మూతి తుడుచుకున్నాడు.

చివరికి ఫిల్, "మా అందరి మీద తీర్పు చెబుతున్నావా నువ్వు?" అంటూ పెద్దపెట్టున నవ్వాడు. అయితే ఆ నవ్వులో సంతోషం కాకుండా నిరసన దాగి ఉంది. "చూశారా, మేధావి వర్గంలో వైతాళికులైన కామ్రేడ్ టీచర్, మాలో ఎంత ఆత్మ విమర్శ ఉందో. అది విషం లాగా పనిచేస్తుంది. అయితే ఇది మొదటి గ్లాసు తాగేవరకే. మొదటి గ్లాసు తాగిన తరువాత ఆత్మ విమర్శ మరిచిపోయి అసలైన విమర్శ మొదలవుతుంది. ఏమంటావు, ఒకప్పటి శ్రామిక యెగార్ పొలుష్కిన్?"

నోనా యురీవ్నా ఉన్నట్టుండి భయపడసాగింది. ఆమె ఎందుకు భయపడుతోందో యెగార్‌కి తెలియలేదు కానీ ఆమె భయపడుతోందన్నది స్పష్టంగా ఉంది. ఆమె కంగారుగా నవ్వింది, కళ్లు మిటకరించింది, కొద్దిగా వంగి అటూ, ఇటూ సర్దసాగింది.

"తినండి మిత్రులారా, తినండి. సీసాలోంచి ఇంకొంచెం ఒంపుకోండి. యెగార్ సవెలిచ్, దయచేసి కొద్దిగా తీసుకోండి."

ఆమెవంక చూశాడు యెగార్. ఆమె కళ్లల్లో ఎంతో విచారం ఉంది, విషాదం ఉంది, దుఃఖం ఉంది. అదంతా నోనా గొంతులో అడ్డుపడి గరగరమంటోంది, ఒక గ్లాసు తాగిన తరువాత క్రోక్ గొంతు మాదిరి.

"నోనా యురీవ్నా టీచర్! నాకు కూడా బాగా, ఎందుకనో బాగా తాగాలని ఉంటుంది. ఇప్పుడు అవకాశం దొరికినప్పుడల్లా తాగుతున్నాను. ఉన్నట్టుండి నాకు వెయ్యి రూబుళ్లు

దొరికాయనుకుందాం – బహుశ అదంతా తాగుడుకే ఖర్చు పెట్టేస్తాననుకుంటాను. చచ్చేవరకు తాగుతాను, ఇతరులకు కూడా తాగబోస్తాను. తాగండి, ప్రియమైన మిత్రులారా, మన అంతరాత్మలు మద్యంలో మునిగిపోయేవరకు తాగండి.”

“అయితే వాటిని పట్టుకో,” ఉన్నట్టుండి క్రోక్ అన్నాడు. “ఆ వెయ్యి రూబుళ్లను తవ్వి, పట్టుకో, వాటి జిమ్మడ!”

నోనా యురీవ్నా వైపు చూశాడు యెగార్. భయంతో కూడిన ఆమె చూపు, వణుకుతున్న ఆమె చేతులు చూసిన అతడికి అంతా అర్థమయ్యింది. దానినంతటినీ అర్థం చేసుకుని అతడు పక్కకు తోసేసిన గ్లాసును అందుకున్నాడు, “ఇది మీ ఆరోగ్యానికి, నోనా యురీవ్నా. మీ ఆనందానికి కూడా.”

అలాగంటూ అతడు తాగాడు. ఆ తరువాత ఒక రొయ్య ముక్క తిన్నాడు, అదెక్కడో వాగులో కాకుండా టొమాటో పచ్చడిలో ఈదుతున్నట్టు ఉంది.

తాగిన తరువాత శిక్షా కాలం ముగిసినవాడికి మాదిరి గ్లాసును కింద పెట్టాడు.

ఆ తరువాత ఆ గదిని పరిశీలనగా చూశారు. అది వాళ్ల పనికి, భవిష్యత్తు ఆదాయానికి నెలవు.

ఎవరు ఏం చెయ్యాలో ముందే నిర్ణయించి ఉంటుంది. భయపెట్టటం క్రోక్ వంతు, పనికిరాని సొల్లు చెబుతూ ఏకాగ్రత కుదరకుండా చెయ్యటం ఫిల్ వంతు, పని గురించి ఆలోచించటం యెగార్ వంతు. ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి దానిని రెట్టింపు చేసి చెప్పాలి. ఇలా పెంచి చెప్పిన తరువాత మొత్తంగా ఎంత ఖర్చు అవుతుందో తేల్చటం క్రోక్ పని.

ఇక్కడ కూడా అలాగే జరుగుతోంది: ఫిల్ తన సొల్లు ఉపన్యాసాలు మొదలుపెట్టాడు, మొత్తం ఎంత ఖర్చు అవుతుందో చెప్పటానికి క్రోక్ బల్ల దగ్గర సిద్ధంగా ఉన్నాడు.

“ఆతిథ్యానికి ధన్యవాదాలు, అమ్మాయిగారు. ఇప్పుడు మీ సమస్యలేమిటో చెప్పండి.”

గదంతా తిరుగుతూ, మాట్లాడుతూ, అంచనా వేస్తూ ఫిల్ భయపెడుతున్నాడు.

యెగార్ ఏమీ మాట్లాడలేదు. అంతా ప్రణాళిక ప్రకారం, అనుకున్నట్టుగానే సాగుతోందని అనుకోసాగారు. ఈ తమాషా అంతా చూస్తూ యెగార్ ఏమి ఆలోచిస్తున్నాడో ఎవరూ – క్రోక్, ఫిల్, నోనా యురీవ్నా – ఊహించలేకపోయారు.

దీనంతటికీ ఈ అమ్మాయికి ఎంత ఖర్చు అవుతుందోనని యెగార్ ఆలోచిస్తున్నాడు.

ఆమెకున్నదంతా ఒక మడత మంచం అని కూడా అతడు గమనించాడు, మనసు గాయపడిన అతడి కొడుకు ఒకనాడు దీనిమీద సేదతీరాడు. దాంతో అతడు పనినంతా చూసి, కావలసిన వస్తువుల లెక్క చూసి, ఖర్చు అంచనా వేసి దానిని రెట్టింపు చెయ్యటానికి బదులు సగం చేశాడు.

"యాభై రూబుళ్లు."

"ఏమిటి?" ఆశ్చర్యంలో క్రోక్ తన ఊతపదమైన తిట్టును కూడా మరిచిపోయాడు.

"నిషా ఎక్కింది, చూశారా," ఇకిలిస్తూ జోడించాడు ఫిల్. "ఇంత మొత్తానికి చెయ్యటం అసాధ్యం."

"వస్తువులకు, మా శ్రమకీ కలిపి మొత్తం యాభై రూబుళ్లు," యెగార్ స్థిరంగా పునరుద్ఘాటించాడు. "అంతకంటే తక్కువకి చెయ్యలేకపోతున్నందుకు క్షమించాలి..."

"క్షమాపణలెందుకు, యెగార్ సవెలిచ్... "

"దీని జిమ్మడ –"

"నోర్ముయ్!" అరిచాడు యెగార్. "ఈ ఇంటిలో అటువంటి భాషను ఉపయోగించటానికి నీకు ఎంత ధైర్యం!"

"వస్తువులన్నీ కలుపుకుని యాభైకి ఎట్లా చేస్తాం?" క్రోక్ ప్రశ్నించాడు.

"ఇంత తక్కువకి చెయ్యటానికి నేను కూడా తిరస్కరిస్తున్నాను," అన్నాడు ఫిల్.

"కానీ ప్రియ మిత్రులారా," ఆందోళనతో అంది నోనా యురీవ్నా. "మరైతే –"

"అయితే ముప్పైకే అవుతుంది," మొండిగా అన్నాడు యెగార్. "ఇంకా మీకొక పుస్తకాల అర కూడా చేసి ఇస్తాను, నోనా యురీవ్నా. అప్పుడు నీ పుస్తకాలు నేలమీద అక్కడా, ఇక్కడా పడి ఉండాల్సిన అవసరం లేదు."

క్రోక్ తిట్లనుంచి తప్పించుకోటానికి అతడు అక్కడినుంచి బయలుదేరిపోయాడు. వెనక్కి తిరిగి చూడకుండా అతడు వెళ్లిపోయాడు. ఖాళీ ప్రదేశంలో తవ్వుతున్న కందకం దగ్గరకు వచ్చి పారనందుకుని దానిని సరిచెయ్యసాగాడు.

ఆ ఖాళీ ప్రదేశంలో అతడిని వాళ్లు కొట్టారు. ముందు కందకంలో ఉండగానే కొట్టి, తరువాత బయటకులాగి కొడుతూ ఉన్నారు.

యెగార్ వాళ్లని ఏమాత్రం ప్రతిఘటించలేదు: వాళ్ల కోపాన్ని, నిరాశను ఎవరో ఒకరిమీద ప్రదర్శించాలి మరి. ఒకప్పుడు బంగారు చేతులున్న వడ్రంగి అయిన యెగార్ పొలుష్కిన్‌ని మిగిలినవాళ్ల కంటే పైమెట్టు మీద నిలిపిందేమిటి?

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com